

హైదరాబాద్ వార్త

# అగ్ని ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయం అవసరం

**-వ్యాపార సముదాయాలు, పాత,కొత్త బిల్డింగ్‌లపై ప్రత్యేక దృష్టిసారించాలి**

**-అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి**



జిహెచ్ఎంసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫైర్ డిజి నాగిరెడ్డి, కమిషనర్ ఆర్.వి కర్ణన్, కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వార్ హాల్ అగ్ని ప్రమాదాల నివారణకు ఆయా శాఖలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై చర్చించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో పురాతన భవనాలలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు శాఖాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నాగిరెడ్డి వివరణ కోరారు. ఇటీవల గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదం సభ్య సమాజాన్ని తీవ్ర ఆందోళన కు గురిచేసిందని, అలాంటి పురాతన భవనాల్లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, వ్యాపార భవనంలో అగ్ని ప్రమాదం సంభవించకుండా నిరోధించే చర్యల పై ముందుగా అవగాహన కల్పించి, పాటించని యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని సూచించారు. హెరిటేజ్ బిల్డింగ్ లో గాని, ఇతర బిల్డింగ్ లో షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదాలు సంభవించకుండా ఎలాంటి పరికరాలు వాడాలో ఎలక్ట్రికల్ అధికారులు ప్రైవేటుగా ఫిట్టింగ్ చేసే వ్యక్తులకు అదే విధంగా లైన్ మెన్ లకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా ఎలక్ట్రిక్ షాప్‌లు నిర్వహించే యజమానులకు దశల వారీగా అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని డిస్కమ్ సి.ఈని కోరారు. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ఫైర్ సేఫ్టీ విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, సేఫ్టీ మెజర్స్ ఉంటేనే ట్రేడ్ లైసెన్స్ గాని, ఎన్.ఓ.సి జారీ చేయాలని సూచించారు. నెలకు ఒక రోజు ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు నాగి రెడ్డి వివరించారు. జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ... శిథిలావస్థలో భవనాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. డిజి సూచన మేరకు వ్యాపార సముదాయాలు, వ్యాపార భావనాలలో ఫైర్ సేఫ్టీ విషయంలో పకడ్బంది చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు నూతన నిర్మాణం కొరకు అనుమతి కోసం వచ్చే ప్లాన్‌లో ఫైర్ సేఫ్టీ ప్రాధాన్యత నివ్వాలని కోరారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ... ఫైర్ యాక్సిడెంట్ జరిగిన సందర్భంలో ఫైర్, పోలీస్ శాఖ మాత్రమే సమాచారం వెళుతున్నదని, ఆసమాచారం రెవెన్యూ సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలని జిల్లా యంత్రాంగం తరపున అంబులెన్స్, ఆసుపత్రిలో చికిత్స అందించడం బెడ్స్ డాక్టర్లను సిద్ధం చేయడం లాంటి చర్యలు సకాలంలో తీసుకునే వెసులుబాటు ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 15 మీటర్ల లోపు ఉన్న భవనాలు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, ఆఫీస్ బిల్డింగ్, లాడ్జింగ్, హోటల్, బిజినెస్ మాల్స్, స్టోరేజీ బిల్డింగ్ లు తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. తప్పని సరిగా స్మోక్ డిటెక్టర్ తో పాటు అల్లారం కూడా ఉండాలని ఇది నగర వాసులు గమనించాలని కోరారు.

# నేటి నుంచి తగ్గించిన మెట్రో ఛార్జీలు



**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్. పెంచిన మెట్రో రైలు ఛార్జీలు హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం సవరించిన విషయం తెలిసిందే. ఛార్జీలను 10 శాతం తగ్గిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ తగ్గిన మెట్రో ఛార్జీలు ఈనెల 24వ తేదీ శనివారం నుంచి వర్తించనున్నాయని ప్రకటన విడుదల చేసింది.మెట్రో రైలు కనీస ఛార్జీ రూ.11 గరిష్ఠ ఛార్జీగా రూ.69కి సవరించారు. ఈనెల 15న మెట్రో ఛార్జీలు పెంచుతూ హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ పెంచిన ఛార్జీలు ఈ నెల 17 నుంచి అమల్లోకి వచ్చాయి. గతంలో ఉన్న టికెట్ ధరకు కనిష్ఠంగా రూ.10 నుంచి రూ.12, గరిష్ఠ టికెట్ ధర రూ.60 నుంచి రూ.75గా సవ రించారు. ఈ ఛార్జీలను కిలోమీటర్ల వారీగా పెంచారు. మెట్రో ఛార్జీలు పెంచిన దగ్గరి నుంచి ప్రయాణికులు, విపక్షాల నుంచి ధరలను తగ్గించాలని డిమాండ్‌లు వచ్చాయి. దీంతో ఈనెల 20న పెంచిన ఛార్జీలను 10 శాతం తగ్గిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం కొత్త ధరలు ప్రకటించిన మెట్రో.. శనివారం నుంచి అమలు చేయనుంది.

**10శాతం రాయితీ తర్వాత మెట్రో చార్జీలు..**

మొదటి 2 కి.మీ వరకు రూ.11(ఇదే కనిష్ఠం)
2 నుంచి 3 కి.మీ వరకు రూ.17
4 నుంచి 6 కి.మీ వరకు రూ.28
6 నుంచి 9 కి.మీ వరకు రూ.37
9 నుంచి 12 కి.మీ వరకు రూ.47
12 నుంచి 15 కి.మీ వరకు రూ.51
15 నుంచి 18 కి.మీ వరకు రూ.56
18 నుంచి 21 కి.మీ వరకు రూ.61
21 నుంచి 24 కి.మీ వరకు రూ.65
24 కి.మీ ఆపైన రూ.69(గరిష్ఠ ఛార్జీ)

# దొంగ పోలీస్ ఆటలు..!

**- కొలిక్కి రాని కేసులు రోజుల తరబడి దర్యాప్తులు**

**- దర్జాగా తిరుగుతున్న నిందితులు**

**- ఓ దొంగపై ఏడాదిగా పోలీసులు గాలింపు**



**హైదరాబాద్, మే23, ప్రభాతవార్త:** నల్లా దొంగతనాల కేసులో ఓ నిందితుడి ఆచూకీ కోసం ఏడాదికిపైగానే గాలిస్తున్నారు. టెక్నాలజీ అభివృద్ధి అయిన అరెస్ట్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారనేది స్పష్టంగా తెలుస్తోంది. అదేవిధంగా కాచిగూడలో ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతులను చూసి ఇంటి పనివాళ్లే భారీగా బంగారం, నగదు చోరీ చేసిన ఘటనలో నిందితులు నేపాలీలని గుర్తించినా ఇంకా వేట కొనసాగిస్తున్నారు. వారిని నేటికీ అదుపులోకి తీసుకోలేదు. కూకట్‌పల్లి చైన్‌స్నాచింగ్ ఘటనలో ఇదే పరిస్థితి. సికింద్రాబాద్‌లో కొనసాగింపుయే... ఇలా ఒక్కటేంటి నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వందల్లో ఉంటాయి. నేరాలు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచడంలో నిర్దిష్ట సమయం లేకుండా పోతోంది. ఎంతో మంది నేరారోపణలు ఉన్న వారు బహిరంగంగా రోడ్లపైన తిరుగుతున్న పోలీసులకు కనిపించడం లేదు. ఒకరు ఏడాదికి అరెస్ట్ కాగా...మరొకరు రెండుమూడు ఏళ్ల సమయం పడుతుంది. దీంతో నిందితులు నేరంపై నేరాలు చేస్తూ తప్పించుకుంటూన్నే ఉంటున్నారు. పట్టుకోవడంలో ఎందుకింత జాప్యం జరుగుతుంది. హత్య, అత్యాచారాల కేసులపై ఉన్నంత శ్రద్ధ చోరీ ఘటనల్లో కానరాకపోవడంపై లొసుగులు ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. నిఘానేత్రాలు అందుబాటులో ఉన్నా కేసులను ఛేదించడంలో కాలయాపన చేయడంపై పోలీసుల బాధ్యతరహిత సేవలపై నిలువెత్తు సాక్ష్యంగా మారుతున్నాయి.

**సీసీ కెమెరాలున్నా.. నెలల తరబడి దర్యాప్తులు..**

మధురాపూరి పోలీస్‌స్టేషన్ పరిధిలో నల్లాలు చోరీకి పాల్పడ్డాడు. స్థానికులే నిఘా నేత్రాల ఆధారంగా పట్టుకొని పోలీసులకు అప్పగించిన పోలీసుల నిర్లక్ష్యంతో తప్పించుకున్నాడు. మళ్లీ అతని ఆచూకీ కనిపెట్టేందుకు ఏడాదికి పైగానే అయింది. ఇంకా గాలింపు చర్యలే చేపడుతున్నారు. ఇలా ఒక దొంగ పట్టుకోవడం కోసం పోలీసులందరూ టీంగా ఏర్పడి ఒకరి కోసం ఇంతగా సమయం కేటాయించడంతో మిగత దర్యాప్తుల పరిస్థితి ఏంటని పలువురు పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఆధునిక టెక్నాలజీ ఉన్న పోలీసుల జాప్యంపై ఎన్నో అనుమానాలు రేకెత్తిస్తున్నాయని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అడుగడుగున సీసీ కెమెరాలు, స్టేషన్‌లో మానిటరింగ్ చేస్తున్న ఒక దొంగను పట్టుకోలేకపోయారు. అదేవిధంగా కాచిగూడలో నేపాలీలను గుర్తించిన పట్టుకోవడంలో విఫలమయ్యారు. సుమారు పదిహేను రోజులు కాస్తున్న కేసులో పురోగతి కనిపించడం లేదనే తెలుస్తుంది. ఇలా నిందారోపణలు ఉన్న వారు పోలీసుల కళ్లుగప్పి మరిన్ని నేరాలకు పాల్పడుతున్నారు. బాలానగర్, మధురాపూరి కాలనీ, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్‌తో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నో కేసులు దర్యాప్తులోనే ఉన్నాయి. అలా రోజుల తరబడి జాప్యంతో ఒక్కొక్కరు ఎన్నో కేసుల్లో నిందితులుగా మారుతున్నారు. ఇక బెయిల్‌పై రావడం మళ్లీ అదే బాట అనుసరించడంతో భయం లేకుండా పోతుందనే భావన కలుగక మానదు.

**కోర్టుముందుకు ఇరవైరోజులే గడువు..మరీ ..?**

ఫిర్యాదురాగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలి. నిందితులు పరారైతే సీసీ ఫుటేజీల ఆధారంగా గాలింపుచర్యలు చేపట్టాలి. అప్పటికి సాధ్యంకాకపోతే టీంలుగా ఏర్పడి మూడ్నాలుగు రోజుల్లో నిందితుల ఆచూకి ప్రాథమికంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. వేరే రాష్ట్రాలకు తరలివెళ్లిన అక్కడి పోలీస్ సహకారంతో సుమారు ఇరవై రోజుల గడువులోపు నిందితుల అభియోగాలను కోర్టుకు సమర్పించాలి. తగిన సాక్ష్యాలు సేకరించి నేరారోపణలు ఉన్న నిందితులపై కఠినశిక్ష అమలయ్యేలా పోలీసులు వ్యవహరించాల్సి ఉంటుంది. నేరాలకు అనుగుణంగా విచారించి గత కేసులు వెలికీతీయడం, అభియోగాలకు అనుగుణంగా సెక్షన్లు, కోర్టుకు తరలింపులో జాప్యం రాకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టాలి. అలా కాకుండా మొక్కుబడి చర్యలతో నిందితులు యధేచ్ఛగా బహిరంగంగా తిరుగుతున్నారు. నేరాల తీవ్రత ఉన్న సెక్షన్లు తగ్గించిన నిందితులను తప్పిస్తున్నారనే అనుమానాలు రాక మానదు. పకడబ్బందిగా నేరస్తులకు శిక్ష పడితే పునరావృత్తం కాకుండా తగ్గుముఖం పడుతాయని న్యాయవాదులు, సామాజికవేత్తలు, బాధితులు పేర్కొంటున్నారు.

# వామ్మో ..మళ్ళీ కరోనా..!

**-నగరంలో కొవిడ్ కలకలం**

**-కూకట్‌పల్లిలో ఓడాక్టర్‌కు పాజిటివ్**

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ల సూచన**



**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి వళ్లీ వచ్చింది. తెలంగాణలో కొవిడ్ కలకలం రేపింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కొవిడ్ కేసు నమోదయింది. కూకట్‌పల్లిలో ఓడాక్టర్‌కు కొవిడ్ పాజిటివ్ నిర్ధరణ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన్ను క్వారంటైన్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో కరోనా మరింత వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు,జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే ఇంట్లో విడిగా ఉండాలని, వైద్యుల సలహాలు, సూచనలు అనుసరించి మందులు వాడాలని తెలిపారు. ప్రయాణాల్లోనూ, జనసమూహాల్లో ఉన్నప్పుడు తప్పని సరిగా మాస్కులు వాడాలని అధికారులు తెలిపారు. కొవిడ్ కేసుల ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చినవారు అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

## గోహింసలపై కఠిన చర్యలు తీసుకుంటాం : సిపి సీవీ. ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సీవీ.ఆనంద్

**హైదరాబాద్, మే23, ప్రభాతవార్త:** బక్రీద్ పురస్కరించుకుని గోహింసలకు పాల్పడకూడదని, సోషల్‌మీడియాలో ఎవరైన వైరల్ చేస్తే వారిపై కఠినచర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బక్రీద్ పండుగ శాంతియుత వాతవరణంపై బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గోసేవా సంఘం ప్రతినిధులపై సమావేశం జరిగింది. సిటీ అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, డీసీపీ, ఏసీపీల పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోసంరక్షకులు సంయమనం పాటించాలని, గోవ్యధలపై ఏమైన సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలని, ఎట్టిపరిస్థితుల్లో ఇరువురి నడుమ దాడులకు తావుండకూడదన్నారు. అంతకు ముందు గోసేవా ప్రతినిధులు మాట్లాడారు గో ఉత్పత్తి పర్యావరణకు మేలు చేస్తుందని, ప్రోత్సాహించడానికి తాము కృషి చేస్తున్నామని వివరించారు.కార్యక్రమంలో యుగ తులసీ ఫౌండేషన్ చైర్మన్ కొలిశెట్టి శివకుమార్, గోరక్షక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్‌సింగ్, అఖిల భారతీయ గోసేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, భారతీయ ప్రాణీ మిత్ర సంఘ్ అధ్యక్షుడు జస్రాజ్ శ్రామల్, లవ ఫర్ కౌ ఫౌండేషన్ అధ్యక్షుడు జస్మిత్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్2 నుండి వ్యవసాయ విశ్వవిద్యాలయ విత్తన వారోత్సవాలు

**-ఉపకులపతి అల్దాస్ జానయ్య**

**అత్తాపూర్ మే23,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని జూన్2న సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు ఉపకులపత్తి డాక్టర్ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ....ఈకార్యక్రమంలో భాగంగా జూన్2వతేదీన ప్రతి రెవెన్యూ గ్రామానికి చెందిన 3-5 మంది అభ్యుదయ రైతులకు విశ్వవిద్యాలయం నుండి అందజేయనున్న నాణ్యమైన విత్తన సంచుల పంపిణీ కార్యక్రమ లాంఛనంగా ప్రారంభకానున్నది.ఈ విత్తన వారోత్సవాలలో భాగంగా జూన్ 3వ తేది నుండి ఈ క్రింద తెలియజేయబడిన వ్యవసాయ విశ్వవిద్యాలయ కేంద్రాల నుండి పేర్కొనబడిన పంటల విత్తనాలను విశ్వవిద్యాలయం రైతులకు పంపిణీ చేయనున్నారు. వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం మరియు చిరుధాన్యాల పంటలకు సంబంధించిన సుమారు8500క్వింటాళ్లు సిద్ధంగా ఉంచనున్నారు. ఈ సందర్భంగా రైతులు పరిమిత వనరులతో పరిమితంగా పంపిణీకి సిద్ధంగా ఉన్న నాణ్యమైనవిత్తనాలను ఈ విత్తనవారోత్సవాలలో భాగంగా సంబంధిత కేంద్రాల నుండి కొనుగోలు చేసుకోవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి జానయ్య రైతులను కోరారు.

## అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**-జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే**





అధికారులు, కార్పొరేటర్లతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ హేమంత్

**శేరిలింగంపల్లి, మే 23 ప్రభాతవార్త** వెస్ట్‌జోన్‌లోని అన్ని విభాగాల అధికారులు,కిందిస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని,సమిష్టికృషితో శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే అన్నారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్లు,సర్కిళ్ల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు మంజుల రెడ్డి,సిందూ ఆదర్శరెడ్డి,మెట్టు కుమార్, గంగాధర్‌రెడ్డి, రాజ్‌కుమార్, యూసఫ్ ,దేదీప్య, జగదీశ్వర్‌గౌడ్,పుష్పనగేశ్‌యాదవ్, అదే విధంగా వివిధ సర్కిళ్ల ఉప కమిషనర్లు, సూపరిండెంటెంట్,ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం,వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో నెలకున్న సమస్యలను, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే మాట్లాడుతూ. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమిష్టి కృషితో నియోజక వర్గ సమగ్రాభివృద్ధికి పనిచేయాలని ఆయన సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. నాలాల విస్తరణ పనులను వేగవంతం చేయాలని, పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని,వర్షాకాలం లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాలాల విస్తరణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌళిక వసతులు ఏర్పాటుకు కృషిచేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే తెలియజేశారు.

# ఫుడ్‌సేఫ్టీపై జిహెచ్ఎంసి ఫోకస్

**-పలు ప్రైవేట్ హాస్టళ్లలో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ**

**-నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలు**

**-30 హాస్టళ్లకు నోటీసులు.. 5 కిచెన్‌లు సీజ్..**

**రూ.2.45లక్షల జరిమానా**





హాస్టళ్లలో తనిఖీ చేస్తున్న టాస్కుఫోర్స్ బృందాలు

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలు పాటించని హాస్టళ్ల పై ఫుడ్ సేఫ్టీ తో పాటుగా ఇతర శాఖలతో ఏర్పడిన టాస్క్ ఫోర్స్ బృందాలు శుక్రవారం అమీర్‌పేట, అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్ మొదలైన ప్రాంతాల్లో పలు హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ మహిళలు, పురుషులు, విద్యార్థుల అవసరాలను తీర్చడానికి ఏర్పడ్డ అనేక ప్రైవేట్ హాస్టళ్ల ఆహార భద్రత, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, అగ్ని ప్రమాద నివారణ మొదలైన నిబంధనలను ఉల్లంఘిస్తూ హాస్టళ్లను నిర్వహిస్తున్నటులన గుర్తించారు.హాస్టళ్ల యాజమాన్యం సెల్లార్లను, పార్కింగ్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం, నియమ నిబంధనలను ఉల్లంఘించి పెద్ద హోర్డింగ్‌లను ప్రదర్శించడం, అపరిశుభ్రంగా తయారు చేస్తున్న నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేయడం, చిన్న గదుల్లో విద్యార్థును పెట్టడం, సరిపోను సరైన మరుగుదొడ్లు ,అంతేకాకుండా వీధుల్లో వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈసందర్భంగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు మాట్లాడుతూ ...నిర్వాహకులతో పాటుగా, భవన యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు ఇప్పటికీ అపరిశుభ్రమైన పరిస్థితులు నిర్వహించడంలో బాధ్యతారాహితంగా ఉన్నాయని ప్రజలకు ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాలలో సుమారు 58 హాస్టళ్లను తనిఖీ చేసి, 30 హాస్టళ్లకు నోటీసులు జారీచేసి, 5 హాస్టల్ కిచెన్‌లను మూసివేయబడ్డాయని జీహెచ్ఎంసీ 1955 యాక్ట్ నిబంధనల ప్రకారం రూ.2.45లక్షల జరిమానా విధించినట్లు వారు పేర్కొన్నారు.

# సిఎంకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ నగరంపై లేదు

**-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



స్థానిక సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త:** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ ఎంపి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీలను సందర్శించారు. భగ్గీఖానాలో ఎంపి నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటిహాల్‌ను పరిశీలించారు. అనంతరం బస్తీలో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని కోరారు. సిఎంకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ హైదరాబాద్ అందాలపైన లేదని, హైదరాబాద్ అంటే ఒక్క హైటెక్ సిటి మాత్రమే కాదని, హైదరాబాద్ అంటే పాత నగరంలోని ఆనేక ప్రాంతాలు ఉన్నాయని ఆయన మరిచిపోయారని విమర్శించారు. సైనికులను అవమానపరిచేరీతిలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఆపెరేషన్ సింధూర్ అంటే ప్రపంచానికి తెలిసిందని, కాని కాంగ్రెస్ నేతలకు తెలియకపోవడం విచారకరమన్నారు. ప్రధాని నరేంద్రమోదీని, తమను విమర్శించండి భరిస్తామని, కాని సైనికులను, అధికారులను అవమానపరచకండి, ఆది దేశాన్ని అవమానపరిచినట్టేనని చెప్పారు. సర్జికల్ స్ట్రైక్‌పైన ఆధారాలు చూపించాలని గతంలో కెసిఆర్, కవితలు కోరారని, ఎప్పటికప్పుడు ఆపెరేషన్ సిందూర్‌పై అప్డెట్ ఇచ్చినప్పటికి ఇంకా ఆధారాలు చూపించాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారని, ఆపెరేషన్ సింధూర్‌లో ఒక్క విమానం కూలిపోలేదని ఈ మేరకు బలగాలు స్పష్టం చేశాయని ఆయన గుర్తు చేశారు. సింధూర్‌పై కాంగ్రెస్ నేతలు రాజకీయం తగదన్నారు.

## మణికొండలో యధేచ్ఛగా అనుమతి లేని నిర్మాణాలు

### - పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికార యంత్రాంగం



నార్సింగి, మే 23 ప్రభాతవార్త : మణికొండ మున్సి పాలిటీలో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అనుమతికి మించి నిర్మాణాలు వెలిస్తే అడ్డుకోవాల్సి న టౌన్‌ప్లానింగ్ అధికార యంత్రాంగం పట్టించుకోకుండా, పరోక్షంగా సహకరిస్తుండడం వల్లనే మణికొండలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మణికొండలో నిర్మితమవుతున్న భవనాలలో 70. శాతం భవనాలు అనుమతులకు విరుద్ధంగా కొనసాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉక్కుపాదం మోపే అధికారం ఉన్న అధికారులే ఊదాసీనంగా వ్యవహరిస్తుండడంతో బిల్డర్లు చెలరేగిపోతున్నారు. గోగ్రీన్ కాలనీలో 20.ఫీట్ల రోడ్డులో భవన నిర్మాణానికి అనుమతే ఇవ్వకూడదు. కానీ అనుమతి ఇచ్చారు. ఇచ్చిన అనుమతి మేరకు భవనాలను నిర్మించ కుండా సెట్‌బ్యాక్స్ వదులకుండా, ఏకంగా జి+6 అంతస్థులు నిర్మించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. గతంలో ఇవే భవనాలపై పత్రికలలో కథనాలు వస్తే టౌన్ ప్లానింగ్ అధికారి, సిబ్బంది అక్కడికెళ్లి గంపలు, పారలు తీసుకు వచ్చారు. నోటీసులు కూడా ఇచ్చారు. పది రోజుల పాటు పనిని ఆపారు. అధికారులు వచ్చి పనులు ఆపిన తరువాత కూడా రెండంతస్థులు అదనంగా వేస్తున్నా, చూసీ చూడనట్లు నటిస్తుండడం గమనార్హం. నిరంతరం వీధిల్లో తిరుగుతూ ఎక్కడ పునాది తవ్వినా వాలిపోయే టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఈ భవనాలు ఎందుకు కనిపించడం లేదో అర్థం చేసుకోవచ్చు. నోటీసులు ఇచ్చి నోట్లు దండుకోవడం వల్లనే నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఈ అక్రమ భవనాల జోలికి అధికారులు రావడం లేదన్నది సుస్పష్టం. నోటీసులు ఇచ్చామని చేతులు దులుపుకోవడం మణికొండ టౌన్‌ప్లానింగ్ అధికారులకు సర్వసాధారణమైపోయింది. పైపెచ్చు త్వరగా రంగులేసుకోండి, లోపలి పనులు తరువాత చేసుకోండని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణం చేపడుతున్న బిల్డర్లకు సలహాలు కూడా ఇస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్న టౌన్‌ప్లానింగ్ శాఖ అధికారులు, సిబ్బందిని దారిలో పెట్టాలని, అలాగే మణికొండలో జోరుగా కొనసాగుతున్న అక్రమ భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

**మున్సిపల్ కమిషనర్ వివరణ :**

మణికొండ మున్సి పల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను" ప్రభాతవార్త" వివరణ అడిగితే అనుమతికి మించి నిర్మించిన భవనాలన్నింటిని కూల్చివేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి అసలు భయం లేకుండా పోతుందని, చట్ట పరిధిలో కఠినంగా వ్యవహరిస్తామని వివరించారు. బిల్డర్లు, ప్రజలు అందరూ టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకే భవనా లు నిర్మించుకోవాలని, అనుమతి ఒకటి తీసుకొని, నిర్మాణం మరోటి చేస్తే ఉక్కుపాదం మోపుతామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కమీషనర్ ప్రదీప్ కుమార్ హెచ్చరించారు.



మణికొండ మున్సి పాలిటీ గోగ్రీన్ కాలనీలో అనుమతి కన్నా అధిక అంతస్థులు నిర్మిస్తున్న దృశ్యాలు.

## చిలకలగూడ డివిజన్ ఏసిపిగా శశాంక్‌రెడ్డి

**సికింద్రాబాద్, మే 23 ప్రభాతవార్త:** ఈస్ట్‌జోన్ చిలకలగూడ డివిజన్ ఏసీపీగా కె. శశాంక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన ఏసీపీ జైపాల్‌రెడ్డి డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. 1995 బ్యాచ్‌కు చెందిన శశాంక్‌రెడ్డి పంజాగుట్ట, ఎల్లారెడ్డిగూడ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా, నార్త్‌జోన్ పరిధిలోని మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించారు. సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ పని చేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా చిలకలగూడ ఏసీపీగా వచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ శశాంక్‌రెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా తరచు నేరాలకు పాల్పడడం, నేరాలతో సంబంధం ఉండడం లాంటి వ్యక్తుల పట్ల, సాధారణ పౌరులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించేవారి పట్ల కఠినంగా ఉంటామన్నారు. బాధితులు నేరుగా తనను కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## అల్వాల్‌లో సింధూర్ విజయోత్సవ తిరంగా యాత్ర



యాత్రలో బిజెపి నేతలు

**అల్వాల్, మే 23 ప్రభాతవార్త:** పాక్ ఉగ్రమూకలుపై భారత సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా శుక్రవారం భారతీయ జనతాపార్టీ ఆద్వర్యంలో ఆపరేషన్ సింధూర్ తిరంగా యాత్ర జరిగింది. గోల్నాక అల్వాల్ చౌరస్తా నుంచి నెరెడ్‌మెట్ వరకు సాగిన యాత్రలో పెద్ద సంఖ్యలో స్థానిక నేతలు పాల్గొన్నారు. త్రివిధ దళాలు శక్తి సామర్థ్యాలు దేశంలోని కొంత మంది మేధావులకు తెలిసాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సి లర్ మాధవ్ నేతలు మల్లిఖార్జున్ గౌడ్, దండుగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా.రాంచందర్

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త:** తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టిపిఎ) వ్యవస్థాపకుడు రాష్ట్ర అధ్యక్షుడిగా 5వ సారి డాక్టర్ మోతుకూరి రాంచందర్ ఏకగ్రీవం ఎన్నికైనారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఎన్నికను అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎ.సుధాకర్ ప్రతిపాదించగా, ఈ ప్రతిపాదనను సినీయర్ నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీపూజ బలపరిచారు. తదనంతరం అన్ని జిల్లాల, రాష్ట్ర నాయకులు ఏకగ్రీవంగా ఆ ప్రతిపాదనను ఆమోదించారు. 2017లో ఈ అసోసియేషన్‌ను రాంచందర్ స్థాపించారు. మొదట ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఇలా రెండు సంవత్సరాలకొకసారి జరిగే ఈ ఎన్నికల్లో ఆయనే ఏకగ్రీవంగా ఎన్నుకవుతూ వస్తున్నారు. తనని ఎన్నుకున్న నాయకులు, సభ్యులందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సైకాలజిస్టుల అభివృద్ధికి, సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తూనే ఉంటానని, కౌన్సిల్ స్థాపన కోసం పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదన్నారు. ఇందుకు సైకాలజిస్టులందరూ సహకరించాలని కోరారు.

## దాన ధర్మాలు చేయడం గొప్ప విషయం



నిరుపేదలకు దుస్తువులను అందచేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్,గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేంద్ర

**అఫ్జల్‌గంజ్,మే 23 ప్రభాతవార్త:**
మారుతున్న కాలంలో పూర్వీకులను గుర్తు పెట్టుకుని దానధర్మాలు చేయడంఎంతో సంతోషదాయకమని గొల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమా మహేంద్ర అన్నారు.జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తండ్రి భీమ్‌సేన్ జైస్వాల్ జ్ఞాపకార్థం గౌలిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్‌తో కలిసి నిరుపేదలకు దుస్తువులను అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన జన్మతో ప్రతి ఒకరు సమాజంలో ఎంతోపేరు ప్రఖ్యాతలు సంపాందిస్తారన్నారు.అందుకు ప్రతి ఒకరు తల్లిదండ్రులను గౌరవాన్ని కాపాడినప్పుడే జన్మకు సార్ధకత ఏర్పుడుతుందన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

## గురుకుల పూర్వ విద్యార్థులకు ఉచిత శిక్షణ : ప్రిన్సిపాల్ సునీత

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:**
ఉన్నతి పౌండేషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఫోగ్రామ్ కోసం నిర్వహిస్తు న్నామని మహేంద్రహిల్స్ లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సి పాల్ సునీత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ గురు కుల పాఠశాలల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీలు చదివి ఖాళీగా ఉన్న పూర్వ విద్యార్థు లకు గురుకుల సొసైటీ నుంచి శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. 25 సంవత్సరాల లోపు ఉన్న గురుకుల పూర్వ విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలని ఆమె సూచించారు. ఆసక్తి గల పూర్వ విద్యార్థులు మహేంద్రహిల్స్ లోని గురుకుల పాఠశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

## బోయిన్‌పల్లిలో వ్యక్తి అదృశ్యం

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** ఇంట్లో నుంచి బయటిక వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ.కల్పన తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ బోయిన్‌పల్లి ఎస్.కె.ఫంక్షన్ హాల్‌వద్ద నివాసం ఉంటున్న గూడురు బిక్షపతి (32) అనే వ్యక్తి కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొన్ని రోజుల నుంచి మధ్యానికి బానిసైయ్యాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన బిక్షపతి అచూకీ తెలియకపోవడంతో అతని తల్లి యాదమ్మ ఫిర్యాదు చేసింది. ఈ కేసును బోయిన్‌పల్లి పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

## పాతబస్తీలో ఇద్దరు మైనర్ బాలికలపై యువకులు అత్యాచారం

**చార్మినార్,మే 23 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఇద్దరు మైనర్ బాలికలపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన హుస్సే నీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.హుస్సే నీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయుల కథనం ప్రకారం...చార్మినార్ సమీపంలోని షాగంజ్ ప్రాంతానికి చెందిన ఇద్దరు మైనర్ బాలికలపై వరుసకు బంధువులైన బిలాల్ ఉద్దీన్ (23),ఫైయాజ్ ఉద్దీన్ (20)లు మాయ మాటలు చెప్పి ఈ నెల 22వ తేదీ గురువారం అత్యాచారానికి పాల్పడ్డారు.మైనర్ బాలికల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హుస్సే నీఆలం పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసును హుస్సే నీఆలం ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు దర్యాప్తు చేస్తున్నారు.

## భూదాన ఉద్యమ ప్రేరణ కర్త వెదిరె రామచంద్రారెడ్డికి 'పద్మవిభూషణ్' అవార్డు ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహాదేవ్ విద్రోహి

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త:** స్వచ్ఛంద భూదాన ఉద్యమ ప్రేరణ కర్త వెదిరె రామచంద్రారెడ్డి, భూదాన్ ఉద్యమానికి బీజం వేసి స్ఫూర్తిగా నిలిచిన ఆయనకు కేంద్ర ప్రభుత్వం 'పద్మవిభూషణ్' అవార్డ్‌ను ప్రకటించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలని అఖిల భారత సర్వోదయ మండలి మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరు కృష్ణగౌడ్, భూదాన్ రామచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు డా.వెదిరె ప్రబోధ్ చంద్రరెడ్డి, రాష్ట్ర సర్వోదయ మండలి నాయకుడు నరేష్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వెదిరె రామచంద్రారెడ్డి చేసిన సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని, ఆయన సేవలు భావి తరాలకు అదర్శంగా ఉండటానికి, స్ఫూర్తిగా తెలియడానికి ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైన ఏర్పాటు చేయాలని, పాఠ్యపుస్తకాల్లో ఆయన జీవిత చరిత్రను ప్రచురించాలని, ప్రతి ఏడాది ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారపూర్వకంగా నిర్వహించాలని కోరారు. వెదిరె రామచంద్రారెడ్డి పేదలకు 100 ఎకరాల భూమిని దానంగా రాసి ఇవ్వడంతోపాటు భూదాన ఉద్యమానికి అంకురార్పణ చేశారని ఆయన గుర్తు చేశారు. పోచంపల్లి భూదాన పోచంపల్లిగా మారడానికి ఆయనే కారణమన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణలో 2 లక్షల ఎకరాల భూమి, దేశవ్యాప్తంగా 45 లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు దానం చేయడం జరిగిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని, భూదాన యజ్ఞబోర్డును ఏర్పాటు చేయాలని మహాదేవ్ విద్రోహి ప్రభుత్వాన్ని కోరారు.

## సమస్యల పరిష్కారానికి తక్షణమే నిధులు కేటాయించాలి : కిషన్‌రెడ్డి



ఫైప్ లైన్ పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, మే 23, ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారానికి తక్షణమే నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు సాధారణ బడ్జెట్ నుండి మంజూరైన 1.29 కోట్లతో నిర్మించ తలపెట్టిన మంచినీటి ఫైప్ లైన్ పనులను, వివి గిరి నగర్ బస్తీలో, టీఆర్‌టీ క్వార్టర్స్ తో పాటు కవాడిగూడ డివిజన్‌లోని వైశ్రాయి చౌరస్తాలో ఫైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ మరియు స్థానిక కార్పోరేటర్లు పావని వినయ్, రచనశ్రీలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్టానికి 70శాతం రెవెన్యూ తీసుకువస్తున్న నగరంలో పలు కాలనీలు, బస్తీలు, వాడల్లో మౌళిక వసతులు కల్పించేందుకు జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటం శోచనీయమన్నారు. భాగ్యనగరంలో కాంగ్రెస్‌కు ఒక్క కార్పోరేటర్ కానీ, ఎమ్మెల్యే కానీ లేనందు వల్ల నగర అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్పోరేటర్లకు సైతం నిధులు కేటాయించటం లేదని, అందువల్ల అభివృద్ధి పనుల్లో వేగం మందగిస్తుందని అన్నారు. అందాల పోటీలతో నగరం అభివృద్ధి చెందదని, ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న నగర ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి న బాద్యత జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. తక్షణమే వీధిలైట్లు, ప్లేగ్రౌండ్స్, రోడ్ల మరమ్మత్తులు, మౌళిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు పెద్ద ఎత్తున కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బీజేపీ నాయకులు ఏ.వినయ్ కుమార్, స్థానిక డివిజన్ బీఆర్ఎస్, బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## అధికారుల పాలనలో ఆగమాగమవుతున్న మణికొండ ప్రజలు

### - మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ



మణికొండలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, మే 23 ప్రభాతవార్త :** అధికారుల పాలనలో మణికొండ మున్సి పాలిటీ ప్రజలు ఆగమాగం అవుతున్నారని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ మున్సి పల్ అల్కాపుర్ టౌన్‌షిప్‌లోని రోడ్డు నెంబర్-4,24లలో బిఆర్ఎస్ నాయకులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించారు. అనంతరం సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారి తనంతో పని చేసే వారని, ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించి పరిష్కరించే వారన్నారు. అధికారులు పుర వీధులలో తిరుగడం లేదని, ప్రజలే మున్సి పల్ కార్యాలయంకు వచ్చి తమ సమస్యలు ఏకరువు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గోతులమయమైన రోడ్లు, డబ్బులు ఇచ్చిన వారికే మంచినీటి సరఫరా చేస్తున్న లైన్‌మెన్లు, మాట్లాడుతున్నా నోట్లోకి వెళ్లే దోమలు, రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు వంటి సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నా, అధికారులు ఏసీ కార్యాలయాలకే పరిమితమవుతుండడం సిగ్గుచేటన్నారు. వేసవి కాలం కావడంతో ప్రజలు ఇళ్లల్లో వేసుకున్న బోర్లు ఎండిపోయాయని, జల మండలి నుంచి రావాల్సి న నీరు వారిని ఒకసారి సన్నని ధారలాగా వస్తున్నాయన్నారు. ఇక్కడ లైన్‌మెన్లు డబ్బులు ఇస్తున్న వారికే నీటిని వదులుతు, ఇతర కాలనీలను పట్టించుకోవడం లేదని, ఫలితంగా ప్రజలు నీటి కోసం పూర్తిగా ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఇటీవల హైడ్రా అధికారులు పార్కు స్థలాన్ని కబ్జా విడిపించినా దాన్ని అభివృద్ధి చేయడంలో మణికొండ మున్సి పల్ అధికారులు చొరవ చూపడం లేదన్నారు. మణికొండ మున్సి పల్ అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ఉన్నతాధికారులకు బిఆర్ఎస్ పార్టీ తరుపునా ఫిర్యాదు చేస్తామని సీతారాం ధూళిపాళ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్, బొమ్మ ఉపేంద్ర నాథ్‌రెడ్డి, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, రాజేంద్ర ప్రసాద్, షేక్ ఆరిఫ్ మొహ్మద్, సుమ నళిని, బొద్దు శ్రీధర్, చెరుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత వైద్య పరీక్షలు



రోగులకు మందులను అందచేస్తున్న మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్,ఠాకూర్ గోపాల్‌సింగ్‌లు

**బేగంబజార్,మే 23ప్రభాతవార్త:**
ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని ప్రతి ఒకరు అనుసరించాల్సి న అవసరం ఎంతైనా ఉందని సత్య సుందర్ హెల్పింగ్ అండ్ ఫౌండేషన్ చైర్మన్ ఠాకూర్ గోపాల్‌సింగ్ అన్నారు.మేరకు శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రౌండ్,సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ చైర్మన్ ఠాకూర్ గోపాల్‌సింగ్,మెడ్విన్ ఆసుపత్రిల సంయుక్త ఆద్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.మాజీ కార్పొరేటర్లు ముఖేష్‌సింగ్,పరమేశ్వరిసింగ్‌లు హాజరై ప్రారంభించారు.ఈసందర్బంగా మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్ మాట్లాడుతూ గోపాల్‌సింగ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద ప్రజలకు ఉచిత వైద్య చికిత్సలు అందించేందకు ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు.ఈకార్యక్రమంలో మెడ్విన్ ఆసుపత్రి సిఈఓ డాక్టర్ ఈనేష్‌మర్చంట్, సత్య సుందర్ హెల్పింగ్ అండ్ ఫౌండేషన్ ప్రతినిధులు బద్రీనాథ్ సింగ్, ఠాకూర్ సిరిష్‌సింగ్, ఇంద్రపాల్‌సింగ్, సందీప్‌సింగ్, నితిన్‌కాంత్,బల్దేవ్‌సింగ్ వైద్యులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దుండిగల్, మే 23, ప్రభాతవార్త**
నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారి ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బౌరంపేట విలేజ్ ఫీడర్‌లో బౌరంపేట విలేజ్, ల్యాండ్‌మార్క్2, కీర్తి హోమ్స్, అక్షర్ డెవలపర్స్, ప్రణీత్ బ్లూమ్స్, ప్రణీత్ మెడోస్, డిజె హోమ్స్, సుకృతి హోమ్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

## పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తాం

### - మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్



మణికొండ బాపూహిల్స్ కాలనీలో ఎర్రోళ్ల రాధిక ఇందిరమ్మ ఇంటి నిర్మాణంకు ముగ్గువేస్తున్న కమీషనర్ ప్రదీప్ కుమార్.

**నార్సింగి, మే 23 ప్రభాతవార్త :** అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని మణికొండ మున్సి పల్ కమీషనర్ డి.ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ మున్సి పల్ పరిధిలోని బాపూహిల్స్ కాలనీలో ఇందిరమ్మ గృహపథకం కింద ఎంపికైన ఎర్రోళ్ల రాధిక ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి, పునాది తీసేందుకు ముగ్గు వేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రదీప్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ లబ్దిదారులందరికి సకాలంలో బిల్లులు అందజేసి, త్వరగా ఇళ్లు పూర్తి అయ్యేలా సహకరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు స్టీలు, సిమెంటు, ఇసుక తక్కువ ధరలకే ఇచ్చేందుకు సర్కారు ముందుకు వస్తుండడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో విచారణ అధికారి శివసాయి, మేనేజర్ శ్రీధర్, గృహ నిర్మాణ ఏఈ ఇబ్రహీం, వార్డు అధికారులు రాజేష్, బిల్ కలెక్టర్‌లు వర్మ, లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు.

## అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోజరిగింది. ఇందిరా లక్ష్మి నగర్‌లో నివాసం ఉంటున్న బాను ప్రకాశ్ (35) వృత్తి రీత్య కారు డ్రైవర్ గత కొన్ని రోజుల నుంచి మద్యం సేవించి పనిపాట లేక తిరుగుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన బాను ప్రకాశ్ తుకారాంగేట్ చౌరస్తాలో అతిగా మద్యం సేవించి కింద పడిపోయాడు. అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గమనించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు దృవీకరించి గాంధీ మార్చు రీకి తరలించారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు తుకా రాంగేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### : మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్




ర్యాలీలో పాల్గొన్న మహిళలు, అధికారులు

**దుండిగల్, మే 23, ప్రభాతవార్త**
పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. శుక్రవారం దుండిగల్ మున్సి పల్ పరిధిలో దుండిగల్ వార్డు నందు ఉన్న పెద్ద చెరువు వద్ద "అమృత్ మిత్ర వాటర్ బాడి 2.0" ఉమెన్ ట్రీస్ కార్యక్రమాన్ని మున్సి పల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా గ్రూపు మహిళ పొదుపు సభ్యులందరూ చెరువులను సందర్శించి వాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అదేవిధంగా ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా జూట్ బ్యాగులను వాడాలని అందరికీ అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి మహిళ 10 మొక్కలు నాటాలని వివరించారు. అనంతరం మహిళా గ్రూపు సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ సీఓ మంజుల, మహిళ రిసోర్స్ పర్సన్స్, మహిళా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ మిత్ర ప్లాంటేషన్ సందర్శన కార్యక్రమం..



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

**కొంపల్లి, మే 23, ప్రభాతవార్త**
కొంపల్లి మున్సి పాలిటీ పరిధిలో శుక్రవారం ఉమెన్స్ ఫర్ (టిస్ అమృత్ మిత్ర 2.0. ఆన్ ఇనిషిటివ్ కాంపెయిన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో దూలపల్లిలోని లింగయ్య చెరువు దగ్గర మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో అమృత్ మిత్ర ప్లాంటేషన్ విసిటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో డ్వాక్రా (గూపు సభ్యులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, ఎస్‌హెచ్‌జి మెంబెర్స్ మొక్కలు నాటడం కొరకు అనువైన చోటు గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సి పల్ అధికారులు, సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నందనవనం పార్కులో బోర్‌వెల్ ప్రారంభం..



**దుండిగల్, మే 23, ప్రభాతవార్త**
ఏప్రిల్ నెల 11వ తేదీన ఆకుల సతీష్ ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ 4వ డివిజన్ ప్రజలతో కలిసి డాక్టర్స్ కాలనీ నందు నందనవనం పార్కులో బోర్వెల్ లేకపోవడం వల్ల పార్కులో మొక్కలకు నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పార్కులో బోర్, ఇతర మరమ్మతులు చేయానలి కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమీషనర్ తక్షణమే పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 17న బోర్వెల్ వేసి, మే నెల మొదటి వారంలో నందనవనం కాలనీ పార్కు బోర్డు ఏర్పాటు చేశారు. కాగ శుక్రవారం బోర్వెల్ మోటార్ బిగించి, పార్కుకు కావలసిన నీరు అందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్వాతి, లింగస్వామి, ఈశ్వర్రెడ్డి, కృష్ణమూర్తి, బి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీనివాసరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## బిజెఎంసి రాష్ట్ర అధ్యక్షుడిగా నాగార్జున ప్రమాణ స్వీకారం




నాగార్జునకు నియామకపత్రం అందిస్తున్న జాతీయ అధ్యక్షులు అర్నాబ్ చటర్జీ

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:**
భారతీయ జనతా మద్దూర్ సెల్ (బీజెఎంసీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డా.నాగార్జున ప్రమానస్వీకారం చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో బీజెఎంసీ జాతీయ అధ్యక్షుడు అర్నాబ్ చటర్జీ ఈ సందర్భంగా నాగార్జునకు నియామక పత్రాన్ని అందజేసి ప్రమాణం చేయించారు.ఈసందర్బంగా నాగార్జున మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి అందిస్తున్న పథకాలపై అవగాహన పెంచి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఈ శ్రమ్ కార్డుల ప్రాధాన్యతను వివరించి, అందరూ తీసుకునేలా ప్రోత్స హించనున్నట్లు తెలిపారు.తనకు ఈ బాధ్యతను ఇచ్చిన జాతీయ నాయకత్వంపై పూర్తి నమ్మకం ఉందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, సమర్థవంతంగా కార్యకలాపాలను నిర్వహిస్తాను అని ఆయన పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో దీపక్‌శర్మ, ఎన్.ప్రశాంత్ కుమార్,షేక్‌ఖలీఫతుల్లా బాషా, సిద్దాంబి, బాలకృష్ణ, మణ్యం ఉషా, ఎస్.ఖాజా అలీ పాల్గొన్నారు.

## జెన్‌కో సిఎండీని కలిసిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్



సిఎండీ హరీష్‌తో ప్రెసిడెంట్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జనరల్ సదానందం, సురేష్ తదితరులు

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:**
తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిజెన్‌కో)కు ఛైర్మన్ ,మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండీ)గా నూతనంగా నియమితులైన ఐఏఎస్ అధికారి హరీష్‌ని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టిజిపిఈఏ) మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు శుక్రవారం అసోసియేషన్ ప్రెసిడెంట్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జనరల్ సదానందం ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం విద్యుత్‌సౌధలోని సిఎండీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్బంగా ఇంజనీర్లకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.సిఎండీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్, సురేష్, బుచ్చయ్య, విద్యాసాగర్, కిషోర్, పివీ రావు, వెంకటేష్, ప్రశాంత్, పవన్, రాజేశ్వర్,విశ్వనాథ్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యా, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### - వినయ్ కుమార్ స్వామి

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:**
తెలంగాణలో విద్యా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని పియర్సన్ ఇండియా అధ్యక్షులు వినయ్ కుమార్ స్వామి తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడలోని మెరిక్యూర్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పియర్సన్ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి హైద్రాబాద్‌లో ఒక ముఖ్యమైన సెంటర్‌గా అందుబాటులో ఉంటుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని వందకుపైగా ఉన్నత విద్యాసంస్థలతో కలిసి పనిచస్తుందని బిటెక్‌కోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్, మేనేజ్‌మెంట్,ఇంజనీరింగ్ కోర్సులకు అవసరమైన కంటెంట్‌ను అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఇప్పటికే ఐఎస్‌బి, ఐఎంటి, మల్లారెడ్డి, మహేంద్ర యూనివర్సిటీ వంటి ప్రసిద్ద విద్యాసంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సి.సి.రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీవాసులు.

**వనస్థలిపురం. మే.23.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ లోని సాహెబ్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ నుండి గాయత్రీ నగర్ ఫేస్ 2.కమాన్ వరకు సి.సి. రోడ్డు నిర్మాణపు పనులకు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి రూ.71 లక్షలు మంజూరు చేయించారు. అట్టి పనులు శుక్రవారం ప్రారంభం కావడంతో బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఇంజనీరింగ్ అధికారి రాజ్ కుమార్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణపు పనులలో నాణ్యత పాటించాలని అధికారులు,కాంట్రాక్టర్ కు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ,తగు జాగ్రత్తలు తీసుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల ప్రతినిధులు లచ్చిరెడ్డి ని శాలువాతో సత్కరించారు.

## ఘనంగా ముగిసిన ఎల్లమ్మ దేవి వార్షికోత్సవ వేడుకలు



రేణుకా ఎల్లమ్మ కళ్యాణంలో వేదపండితులు, ఆలయ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి.

**వనస్థలిపురం. మే.23.ప్రభాతవార్త :** వనస్థలిపురం, ఎన్. జి.వోస్,కాలనీలో గల శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయ 20 వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం తో ఘనంగా ముగిశాయి. చివర రోజు శుక్రవారం జమదగ్ని సమేత రేణుకా ఎల్లమ్మ దేవి కళ్యాణము వేదపండితుల మంత్రోచ్చారణ ల మధ్య కన్నులపండువగా జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అధ్యక్షుడు ఎం. రాంరెడ్డి,కార్పొరేటర్ లు వంగా మధుసూదన్ రెడ్డి,కొప్పుల నర్సింహా రెడ్డి,ఆలయకమిటి సభ్యులు దొక్కా సూర్యనారాయణ, శ్రీనివాసులు, నారాయణ, శ్యామ్ కుమార్,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం : ఎమ్మెల్యే బలాల



చంచలగూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల చిత్రంలో అబ్రార్ తదితరులు

**మలక్ పేట ,మే 23, ప్రభాతవార్త:** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్ డివిజన్ చంచల్ గూడ, ఖాల్లా తదితర ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకులు అబ్రార్ , ఎఇ మల్లికార్జున్, అతుల్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో మారిన ఫోన్ నెంబర్లు

### న-ఏ డి ఇ రామ్మూర్తి, ఏఈ రామకృష్ణ

**కుషాయిగూడ మే23,ప్రభాతవార్త :** కుషాయిగూడ విద్యుత్ ట్రాన్స్కో సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది ఫోన్ నెంబర్లు అధికారికంగా మార్చారని మారిన నెంబర్లను ప్రజలు ధ్రువీకరించుకోవాలని కుషాయిగూడ విద్యుత్ ట్రాన్స్కో ఏఈ రామకృష్ణ తెలిపారు. గతంలో ఉన్న ఫోన్ నెంబర్లు ఇకపై పని పనిచేయబోవన్నారు. మారిన ఫోన్ నెంబర్లు సైనిక్పురి డిఈ 8712 471473, కుషాయిగూడ సబ్ డివిజన్ ఏడిఈ-8712471475, కుషాయిగూడ ఏఈ -87124 71480, సైనిక్పురి ఏఈ-8712471481, యాప్రాల్ ఏఈ -871 2471482, కాగా టీజీఎస్‌పిడిసిఎల్ కాల్ సెంటర్ నెంబర్ -1912, కుషాయిగూడ కంప్లైంట్ సెల్ నెంబర్ -871247 1503, కుషాయిగూడ ఏరియా, నరసింహ ఫోన్ నెంబర్ -8712 471534, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియా శివకుమార్ ఫోన్ నెం-8712 471558, రాధిక చౌరస్తా నుండి దమ్మైగూడ వెళ్లే దారిలో కుడివైపు గల ప్రాంతాలు టీఎపీ కాలనీ, జమ్మిగడ్డ, దమ్మాయిగూడ పద్మశాలి కాలనీ వరకు కే .వెంకటేష్ నెంబర్ -87124 71538, సాకేత్ సాయిరాం నగర్ అనిల్ కుమార్ నెంబర్ -8712471535, శ్రీనివాస్ నెంబర్- 87124 71557 మారిన కొత్త నెంబర్లను ప్రజలు గమనించి గుర్తుంచుకొని విద్యుత్ సమస్యలు ఉంటే ఆయా పరిధిలోని సంబంధిత సిబ్బందికి, లేదా కాల్ సెంటర్కు, కంప్లైంట్ సెంటర్ కు ఫోన్లు చేసి ఫిర్యాదు చేయాలని కుషాయిగూడ ఏడిఈ రామ్మూర్తి, ఏఈ రామకృష్ణ తెలిపారు. ఫిర్యాదులను స్వీకరించి వెంటనే సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

## కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్



జిహెచ్ఎంసి కమీషనర్‌కు వినతిపత్రంఅందజేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, మే 23 ప్రభాతవార్త:** పనిచేయకుండానే బిల్లు తీసుకున్న కాంట్రాక్టర్‌పై, సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి వాంబే క్వార్టర్స్‌లో సిసి రోడ్డు నిర్మాణానికి గత ఏడాది ఆగస్టులో రూ.9లక్షలు మంజూరు కావడం జరిగిందని, ఈ పనిని ఖాన్ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుందని, అయితే ఎలాంటి పని చేయకుండానే బిల్లు తీసుకున్నట్లు తన దృష్టికి రావడం జరిగిందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి కాంట్రాక్టర్‌తో పాటు అతనికి సహకరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను కార్పొరేటర్ కోరారు.

## అరవింద్ రెడ్డి చేసిన తప్పుడు ఆరోపణలు ఖండిస్తున్నాం : బియన్‌రెడ్డి ఫేస్ 3 ప్రతినిధులు



**వనస్థలిపురం. మే.23.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి పై బి.యన్.రెడ్డి.నగర్ బి.ఆర్.ఎస్.అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి చేసిన తప్పుడు ఆరోపణలను బి.యన్.రెడ్డి.నగర్ ఫేస్ 3 కాలనీ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. బి.యన్.రెడ్డి.నగర్ ఫేస్ 3.ప్రతినిధులు సాయి నికేతన్,భారత్ లాల్,సురేష్ కుమార్,శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ తమ కాలనీలో శివాలయం నుండి పార్కు కు వెళ్లే రోడ్డు తరచుగా పొంగి పొర్లుతూ ఉండడంతో, తాము కార్పొరేటర్ లచ్చిరెడ్డి ని నూతన డ్రైనేజీ పైపులైన్ వేయించాలని కోరడంతో, కార్పొరేటర్ సంబందించిన జలమండలి అధికారులకు చెప్పడంతో డ్రైనేజీ పనులు మొదలయ్యాయని తెలిపారు. అయితే స్థానిక బి.ఆర్.ఎస్.నాయకుడు అరవింద్ రెడ్డి అసలు విషయం తెలుసుకోకుండా,వేరే కాలనీ నిధులు మళ్లించి తమ కాలనీలో పనులు చేస్తున్నాడని అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. రాజకీయాలు ముడిపెట్టి,కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రభావం చూపడం సరికాదన్నారు. నిధులు మళ్లించి కార్పొరేటర్ ఇంటిముందు డ్రైనేజీ పనులు చేయించుకుంటున్నట్లు అబద్ధపు ఆరోపణలు చేయడం అరవింద్ రెడ్డికి తగదని హితవు పలికారు. రాజకీయం లో రాణించాలంటే,కాలనీ అభివృద్ధికి సహకరించాలి.అలా కాకుండా పనిచేసే కార్పొరేటర్ పై బురదజల్లడం సరికాదన్నారు. నిధులు మళ్లింపు విషయం పై జలమండలి అధికారి సిరివెన్నెల ను వివరణ కోరగా ,ఎస్.కె.డి. నగర్ కు మంజూరైన నిధులు మళ్లించారనే విషయం వాస్తవం కాదన్నారు.ఒకే వర్క్ కింద మంజూరైన నిధులను బి.యన్. రెడ్డి.నగర్ డివిజన్ లో హాట్ స్పాట్ ఏరియాలలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. బి.యన్.రెడ్డి.ఫేస్ 3.లో జరుగుతున్న అభివృద్ధి పనులకు,ఎస్.కె.డి.నగర్ లో జరుగుతున్న అభివృద్ధి నిధులతో సంభందం లేదని వివరించారు.

## 31న టిజెఎఫ్ రజతోత్సవాలను జయప్రదం చేయండి

### - రాష్ట్ర టియూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి గుండు ముత్తయ్య



**నేరెడ్ మెట్, మే 23ప్రభాతవార్త :** ఈనెల 31నటి జె ఎఫ్ నిర్వహించే రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని టి యు డబ్ల్యూ జే రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నేరెడ్ మెట్ చౌరస్తా లోని తేజ ఇన్ఫ్రా డెవలప్మెంట్ కార్యాలయంలో టీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రజితోత్సవ వేడుకల గోడపత్రిక ను జిల్లా బాద్యులు అమర్, మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షులు జార్జ్ విల్సన్, ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్,సీనియర్ జర్నలిస్ట్ మురళి యాదవ్ లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని ముత్తయ్య గౌడ్ తెలిపారు. వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ, సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత జర్నలిస్ట్ ఫోరందని అల్లం నారాయణ అన్నారు. ఉద్యమం చల్లబడ్డప్పు అల్లా టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని ముందుకు నడిపింది అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలను సమాజానికి మరోసారి తెలియజెప్పడానికి హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు లోని జలవిహార్ లో ఈ నెల 31న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు.తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి టియుడబ్ల్యూజే నాయకులు వెంకటరమణ నాయుడు, అక్కల రాజేందర్ గౌడ్, దూశెట్టి పాండు గౌడ్, మనోజ్ గౌడ్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్ అభివృద్ధికి భారీగా నిధులు : రజితరెడ్డి



ఉప్పల్ డివిజన్ నిధుల మంజూరు పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నిధుల మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి కాలనీ నేతలకు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్‌లో రాజీవ్ కల్యాణ మండలం అభివృద్ధికి రూ.85లక్షల నిధులు మంజూరు అయ్యాయని, దీంతోపాటు స్మశానవాటికల అభివృద్ధికి రూ.87లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. శాంతినగర్ స్మశానవాటిక అభివృద్ధికి రూ.90లక్షలు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నియోజకవర్గానికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నిధులతో వెయిటింగ్ హాల్, ప్రహరిగోడ నిర్మాణం, ఇతర పనులు చేపడుతామన్నారు. శాంతినగర్, ఇందిరానగర్, గాంధీ నగర్ వాసుల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు బాకారం లక్ష్మణ్, ఏసూరి యాదగిరి, లింగంపల్లి రామకృష్ణ, తిక్క ప్రకాష్, బోనగిరి దాస్, తిరుపతి, అనిల్, జనగామ రామకృష్ణ, గుండె అశోక్, సాయిలు, బాలనరసింహ, మద్దూరి కుమార్, తోకట నరసింహ, మహేష్, మల్లికార్జున్, నరేందర్, మండల నాగరాజు, సురేష్, లక్ష్మణ్, అగ్రిపరాజు, భాస్కర్, చంద్రమౌళి, వినోద్, అనిత, రేణుక, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనలో మళ్ళీ ఇందిరమ్మ రాజ్యం వచ్చినట్లుంది

### -మర్రి హన్మంత్‌రెడ్డి, కందాడి శ్రీరాంరెడ్డి



ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న మర్రి హన్మంత్‌రెడ్డి, కందాడి శ్రీరాంరెడ్డి

**సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇళ్ళ పథకం అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డిలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకానికి సంబంధించి మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌కు సంబంధించిన 8, 9, 27 డివిజన్లలో సంబంధిత అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళ మంజూరు పత్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన హన్మంత్‌రెడ్డి, శ్రీరాంరెడ్డిలు వార్డు ఇంఛార్జిలైన మహేశ్వరం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, పుట్టగళ్ళ జగన్, యెలకొండల శ్రీధర్‌రెడ్డి, బంగారి అశోక్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ పథకం సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ సంక్షేమ పథకాలను గమనిస్తే నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో చూసిన ఇందిరమ్మ రాజ్యం మళ్లీ వచ్చినట్లైందని అన్నారు. పేదలకు వ్యవసాయ భూములను పంచి ప్రభుత్వ భూముల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత దేశంలో కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని వారు స్పష్టం చేశారు. తెలంగాణలో మళ్ళీ ఇందిరమ్మ రాజ్యం చూడడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాతం మహేందర్ యాదవ్, మరాఠి నర్సింగ్, గడ్డం జనార్ధన్, బంగారి శేఖర్, మల్లెపూల నాగరాజు, గౌతమ్, సంపత్‌లతో పాటు స్థానిక లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాబా బోధనలతో విశ్వశాంతి, లోక కళ్యాణానికి కృషి

### -సాయిబాబా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ



బాబాకు విశేష అన్నప్రసాద ఆరగింపు సేవ నిర్వహిస్తున్న పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** బాబా బోధనల ద్వారా లోక కళ్యాణానికి కృషి చేస్తున్నామని ప్రథమ దత్తావతారం శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త, ద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ అన్నారు. మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో శుక్రవారం మధ్యాహ్నం బాబాకు ప్రత్యేక హారతి అనంతరం పీఠాధిపతి స్వహస్తాలతో తయారు చేసిన విశేష అన్న ప్రసాద ఆరగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి బాబా హారతి పూజలు చేసిన తర్వాత స్వయంగా బాబాకు విశేష అన్నప్రసాద ఆరగింపు చేశారు. అనంతరం పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేస్తూ సమర్థ సద్గురు సాయిబాబా బోధనలు సమస్త మానవాళికి ఆచారణీ యమని అన్నారు. అలాంటి బోధనలను నిత్యం ప్రచారం చేస్తూ విశ్వ శాంతి, లోక కళ్యాణానికి పాటుపడడం జరుగు తున్నదని స్వామీజీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, సాయి లలిత్, బాబా భక్తులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ సంక్షేమ పథకాలు



మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ ఇంటి మంజూరు ధృవపత్రం అందజేస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** నిరుపేదలకు అండగా సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకం ఉందని ఎఐసిసి తరుణ్ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ 5, 26 డివిజన్లలో ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ళ పథకం లబ్ధిదారులు జయలక్ష్మి, పద్మ, నర్సింహ, షేక్ సఫియా తదితరులకు ఆయన ప్రభుత్వం తరపున మంజూరైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాడు వైఎస్ఆర్ నేడు రేవంత్‌రెడ్డిలు పేదల సొంతింటి కలలను నిజం చేశారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను, గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా నెరవేరుస్తున్నదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామని రాఘవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, యాదయ్యగౌడ్, బాలు నాయక్, రాజీ ఖాన్, అయోధ్య చారి, జెల్లా రమేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రఘు, ముత్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగయ్య, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాదన్నపేట మార్కెట్‌లో డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలి

### న-వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



మార్కెట్‌లో పర్యటిస్తున్న ఎంఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, మే 23 ప్రభాతవార్త:** మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో వరదనీరు పోవడానికి డ్రైనేజి లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ శుక్రవారం చార్మినార్ సర్కిల్ జోనల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షం కురిసినప్పుడల్లా మార్కెట్ మొత్తం బురదమయంగా మారి వ్యాపారులు, కొనుగోలు దారులు ఇబ్బందులకు గురవుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఆయన మార్కెట్‌ను సందర్శించి సమస్యను స్వయంగా పరిశీలించారు. అనంతరం జడ్‌సికి వినతిపత్రంనఅందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సిబ్బంది సంధ్య, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం నూతన పాలక మండలి నియామకం

**సైదాబాద్, మే 23 ప్రభాతవార్త:** చారిత్రక నేపధ్యం కలిగిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పాలక మండలి సభ్యులుగా దిండు ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగం శెట్టి శ్రీనివాస్, జనుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ దుర్గారెడ్డి, కుకునూరి గోపాల్ రెడ్డి, పూల నాగరాజు, కె.కవిత, ఒరుగంటి నరేష్, కొంద్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్ గౌడ్, అనుముల రవీందర్‌రెడ్డి, ఈదులకంటి సత్యనారాయణ రెడ్డిలు నియమితులయ్యారు. ప్రధాన అర్చకులు ఎస్.అంబాప్రసాద్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. పాలక మండలి పదవీ కాలం ఒక ఏడాది ఉంటుంది. పాలక మండలి సభ్యులు తమలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈదులకం టి సత్యనారాయణ రెడ్డికి చైర్మన్ పదవి దక్కనున్నట్లుగా తెలుస్తుంది. కాగా నూతనంగా ప్రకటించిన పాలక మం డలి జాబితాలో మొరిశెట్టి శ్రీనివాస్ పేరు కూడా ఉన్న ప్పటికీ ఆయన ఇటీవలే మృతి చెందారు. దీంతో ఆయన స్థానంలో త్వరలోనే మరొకరిని నియమించే అవకాశం ఉంది.

## వర్షాకాలంలో ఇబ్బందులు తొలగించండి : కార్పొరేటర్లు



వివరాలు వెల్లడిస్తున్న రాధాధీరజ్‌రెడ్డి, పవన్‌కుమార్

**ఎల్‌బినగర్, మే 23 ప్రభాతవార్త:** వర్షాకాలం సమీపిస్తుండడంతో కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్కేపురం, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, నాయికోటి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో శుక్రవారం కార్పొరేటర్లు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్బీనగర్ నుంచి అల్కాపురి జంక్షన్ వరకు వేస్తున్న స్ట్రామ్ వాటర్ పైప్ లైన్లను నాగోల్ మూసి లోకి కలపడానికి సరైన అవుట్ లైన్ లేనందువల్ల చుట్టుపక్కల ఉన్న భరత్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, హరిపురి కాలనీ, అల్కాపురి కాలనీ, స్నేహపురి కాలనీ, న్యూ నాగోల్, సమతాపురి కాలనీల ప్రజలు రాబోయే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవతారన్నారు. సరైన అవుట్ లైట్ ఏర్పాటు చేసి పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన జోనల్ కమిషనర్ సోమవారం వచ్చి పనులను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్, నాయకులు సుందర్ నారాయణ గారు, గట్టు మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిఅన్నారంలో కార్పొరేటర్ మార్నింగ్ వాక్



కాలనీలో పర్యటిస్తున్న ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, మే 23 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మార్నింగ్ వాక్ లో భాగంగా శుక్రవారం ఉదయ్ నగర్ కాలనీ, కమలా నగర్, న్యూ గడ్డిఅన్నారం కాలనీలో పర్యటించి స్థానికులను కలిసి కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల వల్ల వరద నీటిలో వచ్చిన మట్టి రోడ్లపై పేరుకుపోయి వాహనదారులకు ఇబ్బందిగా మారిందని తెలపడంతో వెంటనే కార్పొరేటర్ జిహెచ్ఎంసి శానిటేషన్ డిఈ చందన దృష్టికి తీసుకు వెళ్లడంతో సిబ్బందితో రోడ్లపై పేరుకు పోయిన మట్టిని తొలగింప చేశారు. కాలనీలోని రోడ్లన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సూపర్వైజర్ బుచ్చయ్యకు సూచించారు.ఈ కార్యక్రమంలో న్యూగడ్డిఅన్నారం కాలనీ అధ్యక్షులు రఘు, జిహెచ్ఎంసి శానిటేషన్ డిఈ చందన, సూపర్వైజర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏ సంజీవ రెడ్డి, సాయి, పండు, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, బిజెపి సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, రాజేశ్వరి, శివ రామ్, గిరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం

**సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటలకు తుక్కుగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి నుండి సంస్థాగతంగా పార్టీ బలోపేతం, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలపై సమీక్ష, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం తదితర ప్రధాన అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖిగా చర్చిస్తారు.ఈ కీలక సమావేశానికి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన కాంగ్రెస్ పరిశీలకులు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలతో పాటు తారా సింగ్, సంతోష్, జై భీమ్ నియోజకవర్గ ఇంఛార్జి వినోద్ తదితరులు హాజరవుతున్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న నరసింహగుప్త

**ఎల్‌బినగర్, మే 23 ప్రభాతవార్త:** ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహ గుప్త విజ్ఞప్తి చేశారు. భారీ వర్షానికి డివిజన్ లోని ఫణిగిరి, బాబు కాంప్లెక్స్, న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీలలో ఇళ్లలోకి వరద నీరు వచ్చిన సమాచారంతో కార్పొరేటర్ అక్కడకు చేరుకొని స్థానికులతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరద నీరు, మురుగునీరుతో దుర్గంధం వేస్తోందని వెంటనే సమస్య పరిష్కరించాలని సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత, జలమండలి జీఎం బలరామ రాజు, డీజీఎం రవివర్మ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య , కాలనీ వాసులు అజయ్, నరేందర్ రెడ్డి, రాంబాబు, రాజేశ్వర్ రావు , పద్మిని, స్వప్న, బీజేపీ నాయకులు నవీన్ యాదవ్, నరేందర్ రెడ్డి, రాజేష్, అంజి , మధు, ప్రకాష్ పాల్గొన్నారు.

## సుక్క కిరణ్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సత్కారం



సుక్క కిరణ్‌ను సత్కరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** దళిత రత్న అవార్డు గ్రహిత సుక్క కిరణ్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. ఇటీవల దళితరత్న అవార్డు అందుకున్న సుక్క కిరణ్ పలువురు పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేయాలని సూచించారు. ప్రజా సేవలో తన వంతు పాలుపంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, ప్రవీణ్, సురెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : జిల్లా విద్యాధికారి



ఉప్పల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి విజయకుమారి, ఎంఇఒ రామరావు తదితరులు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను మండల విద్యాధికారి రామరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతను ఆర్టిఫిషియల్ (ఎఐ) ఇంటలిజెన్స్ ఉపయోగించుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, శిక్షణ సమయంలో ఉపాధ్యాయులు పొందిన జ్ఞానాన్ని తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తగు చేయూత అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామరావు, ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉప్పల్ మండల ఆర్‌పిలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాచారం పెద్దనాల పూడిక మట్టిని వెంటనే తొలగించాలి



సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, మే 23 ప్రభాతవార్త :** నాచారం పెద్దనాల నుండి పూడిక తొలగింపు పనులు ఈ సంవత్సరం చాలా బాగా జరిగాయని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులు, కాంట్రాక్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా పెద్దనాల నుంచి గుట్టలు గుట్టలుగా పూడికను తీయడం జరిగిందన్నారు. తీసిన పూడిక గుట్టలు గుట్టలుగా రోడ్లపై ఉండడంతో ఈ రోడ్డు గుండా వెళ్లే వారికి అలాగే నాలా పక్కన ఉండే వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండటంతో పాటు దుర్వాసన వస్తుందని తొందరగా మట్టి కుప్పలు ఇక్కడి నుంచి తరలించాలని అధికారులను కోరడం జరిగిందన్నారు. . తొందరగా ఈ పూడికను ఇక్కడి నుంచి తరలించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బారసా నాయకులు సాయిజన్ శేఖర్, సంఘం యాదగిరి, కట్ట బుచ్చన్న గౌడ్, లక్ష్మణ్, కిట్టు, యాకి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన వైట్ టీ షర్ట్ ఉద్యమానికి ప్రతి ఒక్కరు మద్దతు పలకాలని రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన యూత్ కాంగ్రెస్ శిక్షణ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, జంగయ్యయాదవ్ తదితరులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికి పురోగతి అనే అంశంపై శిక్షణ ఇస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, ఇంచార్జ్ ఖలీల్, జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, కార్యదర్శి కిషోర్, సచిన్, వినేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.